మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# రైతుల్లో ఆందోళన అవసరం లేదు



గోదాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

- వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తాం
- అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ధాన్యం నిల్వ ఉంచేందుకు అదనంగా గోదాములను ఏర్పాటు చేయడం జరుగుతోంది : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, మే 28, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేసి, వచ్చే 15 రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండలం చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం నిల్వ కోసం అదనంగా ఏర్పాటు చేసిన గోదామును అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్‌తో కలిసి సందర్శించి అక్కడ జరుగుతున్న అన్లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిస్థాయిలో కంప్లీట్ చేస్తామని హామీ ఇచ్చారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అకాల వర్షం కారణంగా 600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడవగా వాటిని బాయిల్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో గత రెండేళ్ల నుంచి రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడులు వస్తున్నాయని తెలిపారు. గతంలో సీజన్ కు 1,50,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చేదని, గత రెండేళ్ల కాలం నుంచి ఒక సీజన్ కు జిల్లాలో 2,50,00 మెట్రి టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో అత్యధిక దిగుబడి ధాన్యం నిల్వ కోసం గోదాముల్లో స్థలం కొరత ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఈసారి వరి ధాన్యం కోతలు ఆలస్యంగా ప్రారంభం కావడం, బీహార్ నుండి వచ్చే హమాలీల కొరత కూడా కొనుగోళ్ల ప్రక్రియ నెమ్మదిగా సాగడానికి ఒక కారణమని తెలిపారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి ఇప్పటివరకు 1,50,000మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించడం జరుగుతోందని, ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల దాకా కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని 45 ప్రాంతాల్లో అన్లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం నిలువకు స్థలం కొరత ఏర్పడిన నేపథ్యంలో చిట్యాల మార్కెట్ యార్డులోని షెడ్ 1 ను గోదాముగా మార్పిడి చేసుకొని ధాన్యాన్ని అన్లోడింగ్ చేసి నిల్వ చేయడం –మిగతా3లో..

## ఏ రైతును కదిలించినా కన్నీళ్లే..

### మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



రైస్‌మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 28 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మండల పరిధిలోని మిల్లు పరిశీలన రైతులనుకదిలిస్తే కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, ప్రభుత్వం పంట కొనుగోలు చేయక పోవడంతో వర్షానికి పంట తడిసిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం పరిధిలోని రైస్ మిల్లులను ఆయన పరిశీలించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నదని, కానీ మంచిగా ఉన్న ధాన్యం కూడా కొనడం లేదని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. రోహిణి కార్తె రావడంతో పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధం అవుతుంటే కనీసం పిండి సంచులు లేవని ఆరోపించారు. రైతు బంధులేదు, రుణమాఫీ లేదు, సకాలంలో కరెంటు ఇవ్వలేదు..ఆరుగాలం కష్టం చేసి పండిన పంట కూడా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు పనులు పూర్తి చేసేందుకు పిలిచినా టెండర్లు రద్దు చేసారని, ప్రాజెక్ట్ పూర్తి చేయమంటే మంత్రులు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు.

పిండి సంచులు సకాలంలో ఇవ్వాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కెసిఆర్‌ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, తాము అధికారంలో ఉన్నప్పుడు రైతులకు అన్నిఅందుబాటులోపెట్టామన్నారు. ధాన్యం కొనుక్కుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి వెంట గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు మల్లు నర్సింహారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్ ఉన్నారు.

## ధాన్యం దించుకోవడంలో ప్రభుత్వానికి సహకరించండి

- జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మిల్లర్లతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, పాల్గొన్న మిల్లర్లు, అధికారులు

**వనపర్తి, మే 28, ప్రభాతవార్త:** జిల్లాలోని రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని దించుకోవడంలో ప్రభుత్వానికి సహకరించి, సమన్వయంతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వరి ధాన్యం నిల్వ కోసం అదనపు స్థలాల అంశంపై అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు వచ్చిన నేపథ్యంలో వరి ధాన్యం నిల్వ కోసం అదనపు స్థలం అవసరం ఏర్పడుతోందని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని దించుకోవడంలో ప్రభుత్వానికి సహకరించి, అన్లోడ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మిల్లర్ల వారీగా గోదాములలో ఖాళీ స్థలాలపై చర్చించిన కలెక్టర్ అదనంగా వారికి ధాన్యం బస్తాల కేటాయింపు పై సూచనలు చేసి,వేగంగా దింపుకోవాలని ఆదేశించారు. నిల్వ కోసం అందుకు తగ్గ అద్దె చెల్లించడం జరుగుతుందని తెలిపారు. డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లై ఆంజనేయులు, మిల్లర్లు ఇతర అధికారులు ఉన్నారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు
- ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

4



ఈద్గా దగ్గర ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



ఈద్గా వద్ద మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి







ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాగర్‌కర్నూల్ , అచ్చంపేట, గద్వాల ఎమ్మెల్యేలు

## బురదజల్లే ప్రయత్నం మానుకోండి

- ప్రజలు గమనిస్తున్నారు..
- ఇందిరమ్మ రాజ్యం ఇంటింట సౌభాగ్యం : ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

**అచ్చంపేట, మే,28 ప్రభాతవార్త:** ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం మానుకోండి అని మీ భాగోతం తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ పై లేనిపోని ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న ఆరోపణలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాము అన్నారు. చట్టం గురించి ఏం మాట్లాడుతూ ఎక్కడ పరిధిలో పనిచేశారని ఆయన పేర్కొన్నారు. బీఎస్పీ పార్టీ అని చెప్పి బిఆర్ఎస్‌లో చేరడం వెనక కేసీఆర్ హస్తముందని వాస్తవాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నల్ల మట్టి దొంగ అని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆరోపించారు. ఎమ్మెల్యే కాకముందు మూడు బట్టల షాపులు ఉన్న మర్రి, ఇప్పుడు కోట్లకు ఎలా అధిపతి అయ్యారని ప్రశ్నించారు. మినీ ట్యాంక్ బండ్ పనుల్లో, నల్ల మట్టి దందాలో రూ.1,000 కోట్లు సంపాదించారని,ఆయన బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేందర్, అంతటి మల్లేశ్, బుచ్చిరాములు పాల్గొన్నారు. ఉమామహేశ్వర ప్రాజెక్టు విషయంలో శంకుస్థాపన చేసిన వారే నేడు కోర్టులో కేసు వేసి ఆపుతున్నారని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల చైర్మన్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు,గోపాల్ రెడ్డి, ఉమామహేశ్వర దేవాలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, అంతటి మల్లేష్, రామనాథం పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డులో 107 మక్కల బస్తాలు మాయం!

**అచ్చంపేట, మే, 28 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలో ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రతాలోపాలు మరోసారి బయటపడ్డాయి. మార్కెట్ యార్డుకు అమ్మకం నిమిత్తం తెచ్చిన ఒక నిరుపేద రైతుకు చెందిన ఏకంగా 107 మక్కల (మొక్కజొన్న) ధాన్యం బస్తాలు రాత్రికి రాత్రే దొంగతనానికి గురికావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధితరైతు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన రైతు మంత్రాల జితేందర్ తాను పండించిన మక్కల ధాన్యాన్ని బస్తాల్లో నింపి అచ్చంపేట మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు మార్కెట్ ప్రాంగణం లోనే ఆ బస్తాల కుప్ప సురక్షితంగా ఉంది. అనంతరం రైతు వ్యక్తిగత పని నిమిత్తం తన ఇంటికి వెళ్లి, మరుసటి రోజు (బుధవారం) మధ్యా హ్నం వచ్చి చూసేసరికి అక్కడ ఉన్న 107 మక్కల సంచులు పూర్తిగా మాయమయ్యాయి.



జితేందర్, రైతు

**కన్నీరు మున్నీరైన రైతు – పోలీసులకు ఫిర్యాదు:** మార్కెట్ యార్డులో చాలా రోజులుగా నిల్వ ఉంచిన తన ధాన్యం బస్తాలు ఒక్కసారిగా –మిగతా3లో..

## తెలంగాణ చరిత్రను ప్రపంచానికి చాటిన మహనీయుడు

### గొప్ప మేధావి సురవరం ప్రతాపరెడ్డి : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, మే28 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంత చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప మేధావి సురవరం ప్రతాపరెడ్డి అని ఎమ్మెల్యే తుడి మేగా రెడ్డి పేర్కొన్నారు. సురవరం జయంతి సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి తో కలసి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన గల సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ చరిత్రకారుడు, రచయిత, పత్రిక సంపాదకుడు అయిన సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.తెలుగు భాష అభివృద్ధికి, సామాజిక చైతన్యానికి, ప్రజల్లో విజ్ఞాన వికాసానికిఆయన చేసినకృషి అపారమైందన్నారు.గోల్కొండ పత్రిక" ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సామాజిక సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి అని ఆయన కీర్తించారు.తెలంగాణ చరిత్రను పుస్తక రూపంలో అందించి భవిష్యత్ తరాలకు అమూల్యమైన వారసత్వాన్ని అందించారన్నారు.ప్రతి ఒక్కరం ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిలి ఆదిత్య, వనపర్తి పట్టణ అధ్యక్షులు కదిరి రాములు, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు మైనార్టీ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సేవాభావానికి ప్రతీక బక్రీద్ పండుగ : ఎమ్మెల్యే**



పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

త్యాగం, ప్రేమ, సహనం, సేవాభావానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర పండుగ బక్రీద్ పండుగ అని వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాన్ని బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గోపాలపేట రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద –మిగతా3లో..

## జిల్లాలో వరి కొనుగోళ్లు 98 శాతం పూర్తి

- నేడు ఈసీడీ అవగాహన కార్యక్రమం నిర్వహణ
- నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

**నారాయణపేట, మే28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో గురువారం వరకు 17,148 మంది రైతుల నుంచి 1,31,986 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యపు మొత్తం విలువ రూ.315.31 కోట్లుగా ఉంద న్నారు ఇందులో ఇప్పటికే 15,986 మంది రైతులకు రూ.262 కోట్లను చెల్లించడం జరిగిందని, ఇది మొత్తం చెల్లింపుల్లో 83శాతమని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయను న్నట్లు పేర్కొన్నారు జిల్లాలో అకాల వర్షాల కారణంగా ఎక్కడైనా ధాన్యం తడిసినట్లయితే అధికారుల సమన్వయంతో వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 98 శాతం పూర్తయ్యిందని మిగిలిన ధాన్యాన్ని కూడా రెండు రోజుల్లో కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తామని కలెక్టర్ వెల్లడిం చారు. ఇదిలా ఉండగా,ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక, మహిళా వారోత్సవాల 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మే 29న ఉదయం 9:40 గంటలకు నారాయణపేట ఆర్‌డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీస్త్రీలు,బాలింతలకు మొదటి 1000 రోజుల సంరక్షణ" ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం,ఆరోగ్య సంరక్షణ, శిశుఎదుగుదల వంటిఅంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతంచేయాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

## బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయండి

- మంత్రి వాకిటి శ్రీహరి



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి

**మక్తల్ టౌన్, మే28 ప్రభాతవార్త:** మక్తల్ మండలం చిట్యాల వద్ద నూతనంగా చేపడుతున్న చిట్యాల గజరందొడ్డి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి కమ్ బారేజ్ నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పనుల నిర్మాణ నాణ్యతను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనుల్లో వేగం పెంచాలని మంత్రి సూచించారు. వర్షాలకు ముందే బ్రిడ్జి కమ్ బారేజ్ నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు మరింత వేగం పెంచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్లను మరోసారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి. గణేష్ కుమార్, ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి, నజీర్ పాషా, బీజేపీ నాయకులు చిట్యాల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం తగ్గదు

- బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిజెపి నాయకులు

**మదనాపురం, మే 28 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు జాప్యం తగ్గదు అని బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. రైతు గోస బీజేపీ భరోసా భాగంగా గురువారం అజ్జకొల్లు గ్రామంలో వరి కొనుగోలు బిజెపి నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించకపోవడంతో నెలల –మిగతా3లో..

## సృజనాత్మకతను వెలికి తీసేందుకే శిక్షణా శిబిరాలు

-భూత్పూర్ మండల విద్యాధికారిణి ఉషారాణి



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎంఈఓ ఉషారాణి, హెచ్ఎం బాలు యాదవ్

**భూత్పూర్, మే 28, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతో దోహదపడతాయని, విద్యార్థులు వేసవిలో కాలాన్ని వృథా చేయకుండా ఇవి ఎంతో అవసరమని భూత్పూర్ మండల విద్యాధికారిణి ఉషారాణి స్పష్టం చేశారు. గురువారం భూత్పూర్ మండలం తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరాల ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ ఉషారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, పాటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మండలంలో తాటికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పలుకార్యక్రమాల్లో పాల్గొనడం ముదావాహమని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ఎం బైకాని బాలు యాదవ్ మాట్లాడుతూ తాము నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో పాఠశాల నుంచి వంద మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయిని ఉపాధ్యాయులతోపాటువాలంటీర్లు ప్రణవి, కుసుమ, అభినయ, అనుశ్రీలు, మహిళాసంఘాల సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## జూన్ 2న పీఆర్సీ ప్రకటించాలి

-సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి : టీఎస్‌సీపీఎస్‌ఈయు అధ్యక్షుడు రవినాయక్

**భూత్పూర్, మే 28, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా ప్రకటించినట్లుగా జూన్ రెండో తేదీన కొత్త పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని రవినాయక్ కోరారు. జూన్ నెల నుంచి ఉద్యోగుల వేతనాల నుంచి ఈహెచ్ఎస్ కోసం 1.5శాతం కోత ఉంటుందని ప్రభుత్వం పేర్కొందని, దీనిపై పూర్తిగా స్పష్టతతో విధివిధానాలు విడుదల చేశాకే జీతాల నుంచి కట్ చేయాలని రవినాయక్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్‌కార్డులపై ప్రభుత్వం విధివిధానాలను విడుదల చేయాలని యూనియన్ అధ్యక్షుడు రవినాయక్‌తో పాటు ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ ఇతర సభ్యులు జాకీర్‌పాష, రామచంద్రయ్య, భాస్కర్, దొరబాబు, రాజు, చంద్రకాంత్, జైపాల్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆలయ అభివృద్ధికై మరో అడుగు ముందుకు..



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

**అచ్చంపేట, మే, 28 ప్రభాతవార్త:** శ్రీశైలం దేవస్థానానికి ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం అభివృద్ధికై మరో అడుగు ముందుకు వేస్తానని ఆలయ పాలక మండలి చైర్మన్ భీరంమాధవరెడ్డి తెలిపారు. అచ్చంపేటమండలంలోని ఉమామహేశ్వర క్షేత్రం పాలక మండలిని రెండవసారి పొడిగిస్తూ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డా. వంశీకృష్ణకు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో ఈ క్షేత్రం మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మరోమారు పాలకమండలిని పొడిగిస్తున్నట్టు లెటర్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అంతటి మల్లేష్, గోపాల్ రెడ్డి, రామనాథం, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట రీత్యా నేరం

● ఉప్పునుంతల ఎస్ఐ పి.మహేష్

**ఉప్పునుంతల, మే 28 ప్రభాతవార్త:** తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశాల మేరకు మండలంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం కానీ, రోడ్లపై సీసాలు పగుల గొట్టడం చట్ట రీత్యా నేరమని ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ గౌడ్ హెచ్చరించారు. చట్టాన్ని గౌరవించి యువత చెడు మార్గములో వెళ్లకూడదని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందుల గురించి చేయకూడదని అలా చేసిన వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు. గ్రామాలలో షాపుల వద్ద రోడ్లపై వాహనాలు నిలిపివేసి రాకపోకలకు అంతరాయం వాహన చోదకులు, షాపు నిర్వాహకులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా యువకులు వాహనాలు జాగ్రత్తగా నడపాలని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు తల్లిదండ్రులు ఇవ్వరాదని అట్టి వాహనాలు మైనర్లు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మండలంలో ప్రజలకు ఏమి ఇబ్బందులు కలిగిన సత్వరమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**ఉప్పునుంతల, మే 28 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన నడి గడ్డ యాదగిరి అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన ఉప్పునుంతల బిఆర్ఎస్ యువ నాయకుడు, రెండో వార్డు సభ్యులు ఎం.డి ఉస్మాన్ తన యుడు ఎండి రఫీ ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబ సభ్యులకు అపద వస్తే తాను సహాయం చేయడానికి ముందుకు రావడం జరుగుతుందని, భవిష్యత్తులో మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రఫీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆదుకోవడమే తమ లక్ష్యమని గ్రామంలో పార్టీల కతీతంగా ఎవరికి ఏ ఆపద వచ్చిన తాను వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం అందజేస్తున్న మండల బిఆర్ ఎస్ పార్టీ యువ నాయకుడు రఫీ తో పాటు ఎల్లయ్య యాదవ్, చిన్న జంగయ్య, బర్ల బాలస్వామి, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ జిల్లా చైర్మన్‌గా డా. వెంకటయ్య నియామకం



ఏఐసీసీ నేషనల్ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పాల్ గౌతమ్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

**నారాయణపేట, మే28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్‌గా కొడంగల్ నియోజకవర్గానికి చెందిన గుండుమాల్ గ్రామ వాస్తవ్యులు డా. గుండుమాల్ వెంకటయ్యను నియమించారు. ఏఐసీసీ నేషనల్ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పాల్ గౌతమ్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ మిరియాల ముస్కుందర్, శాసనసభ్యులు రాం ధర్మపురి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది ఈ సందర్భంగా గుండు మాల్ వెంకటయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు శివకుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సమన్వయం పెంపుదల మరియు సమగ్ర దళిత సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరిని కలుపు కుంటూ పార్టీ స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కొత్త బాధ్యతను విజయ వంతంగా నిర్వహించేందుకు పెద్దల మార్గ దర్శకత్వం, నాయకుల సూచనలు, కార్యకర్తల సహకారం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ తనకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం..

**సురవరం ప్రతాపరెడ్డి జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకం: మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సాగునీటి నిపుణులు ప్రకాష్, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రకాష్

**వనపర్తి, మే 28, ప్రభాతవార్త:** వనపర్తి మొట్టమొదటి ఎం. ఎల్.ఏ సురవరం ప్రతాప్ రెడ్డి 130వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన జయంతి వేడుకలలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో నిష్ణాతులు, తెలుగు భాష పరిరక్షకుడు, సంఘ సంస్కర్త, సాహితీవేత్త, న్యాయ వాది సురవరం ప్రతాప్ రెడ్డి అని కొనియాడారు. సురవరం జీవిత చరిత్ర సమాజానికి స్ఫూర్తిదాయకం కావాలని వారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం అని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిసాగునీటి నిపుణులు ప్రకాష్ మాట్లాడుతూ కాళేశ్వరంప్రాజెక్టు ప్రయోజనాలు సవివరంగా వివరించారు. మహానుభావులు పుట్టిన గడ్డ వనపర్తి.. పాలమూరులో తెలంగాణ వచ్చాక చాలా మార్పులు వచ్చాయి. ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. భారత దేశంలో మహబూబ్ నగర్ లోనే 67 శాతం సారవంతమైన భూమి ఉంది. కృష్ణ, బీమా, తుంగభద్ర మూడు జీవ నదులు ఉన్నాయి.

**పాలమూరు శ్రమ జీవులకు చిరునామా...** ప్రపంచంలో అనేక నిర్మాణాల్లో పాలమూరు వాసులు ఉన్నారు. అయినా ఎందుకు 14 లక్షల మంది వలస వెళ్లారు. గట్టు మండలం లో అత్యంత ఘోరమైన పరిస్థితులు ఉండేవని తెలిపారు. కృష్ణ నది నీళ్లకు నోచుకోక గట్టు ఎడారి ప్రాంతంగా మారేదని పునరుజ్జీవం పొందిన పల్లెలు పాలమూరు జిల్లాలో కనిపిస్తున్నాయన్నారు. వలస వెళ్లిన పక్షులు తిరిగి ఆవాసాలు ఏర్పరచుకున్నాయి.. అస్తిత్వం అంటే మన మూలాలు, మన చరిత్ర, మన వనరులు అనేక ప్రాజెక్టులు. మన ఆచారం. మన సంప్రదాయాలు. మన చారిత్రక కట్టడాలని వివరించారు. బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నిరంజన్‌రెడ్డి మనకు గొప్ప వేదిక మనకు ఇచ్చారని మేము చదువుకునే రోజుల్లో ఒక్కఉపాధ్యాయుడు కూడా మాకు సురవరం గురించి చెప్పలేదని అన్నారు. మా నడిగడ్డ వాసి అయినప్పటికీ తెలియలేదు. మాకు ఎప్పుడూ ఈ విషయాలు చెప్ప లేదు. దాస్యం ప్రణయ్ భాస్కర్ తెలంగాణ అనే పదం మాట్లాడితేనే అవహేళనలు చేశారని గుర్తు చేశారు. సురవరం ప్రతాప రెడ్డి గురించి పాలమూరు జిల్లా ప్రజలకు తెలియక పోవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. గోల్కొండ పత్రిక తెలంగాణ ప్రజలకు ఎందుకు అందుబాటులోకి రాలేదు. నమస్తే తెలంగాణ వచ్చే వరకు తెలంగాణకు అంటూ పత్రిక లేదుప్రాథమిక హక్కులు, మానవ హక్కుల గురించి మాట్లాడితే అవమానించారని అన్నారు. ఆనాడే నీ దేహం మీద నీకుండే హక్కు గురించి మాట్లాడారని కేంద్రమంత్రి కుమారుడి చేతిలో అఘాయిత్యానికి గురై పోలీసు స్టేషన్ కి పోతే ఫిర్యాదు తీసుకోలేదని బాధితుల మీదనే రిటర్న్ కేసు పెట్టారు. ఈ సమాజం ఎక్కడుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా, బీఆర్ఎస్ ఆత్మ స్థైర్యం ఇవ్వకపోతే ఆ నిందితుడు దర్జాగా బయట తిరిగే వాడు. ఆర్టీసీ డ్రైవర్ వద్దు, మొక్కజొన్న కొనుగోలు చేయమని అడిగితే ఉద్యోగం తీసేసారని ఎక్కడుంది వాక్ స్వాతంత్రం అని అన్నారు. హక్కుల గురించి ప్రతి రోజు పోరాడాల్సిన అవసరంఉంది. అమ్మాయిల కోసం డెబ్బై మహిళ డిగ్రీ కళాశాలలు కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. మాజీ మంత్రి ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ. సురవరం చరిత్రను ఇప్పటి సమాజానికి తెలియజేయడానికి ముప్పై ఏండ్ల నుండి కృషి చేస్తున్నామని తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప రెడ్డి పెట్టాలని ఆలోచించినం. ఆ ఫైల్ పెండింగ్ లో ఉన్నపుడే ప్రభుత్వం మారిందని ఈ ప్రభుత్వం వచ్చాక పేరు పెట్టారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారులు సూరవరం ప్రతాపరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన కవులు కళాకారులు

## వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి బి. వెంకటేష్

**మూసాపేట, మే28 ప్రభాతవార్త:** మండలంలోని వేముల, కొమిరెడ్డి పల్లి, మహమ్మద్ హుస్సేన్ పల్లి, నందిపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులతో కలసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో వరి కొనుగోలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వేముల గ్రామం లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఇంకా రెండు లారీలు ధాన్యం రవాణాకు కావాలి అని రైతులు కోరారు. కొమ్మి రెడ్డిపల్లి వరి కొనుగోలు కేంద్రంలో ఒక లారీ అవసరం ఉందని సంబంధిత రైతులు, కొనుగోలు కేంద్రంఇంచార్జ్ దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ధాన్యం రవాణా కు లారీలను వెంబడే ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామంలోఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 6000గన్ని బ్యాగులు అవసరమని, 6లారీలు ఏర్పాటు అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల కొనుగోలు కేంద్రాలలో కొన్ని లారీలు, ట్రాక్టర్లు దాన్యం రైస్ మిల్స్ దగ్గర అన్లోడింగ్ కావడంలేదని రైతులు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేష్ మాట్లాడుతూ రైతులకు తూకం చేసిన వెంటనే రవాణాకు, లారీల ఏర్పాటు, ట్రాన్స్ పోర్ట్ యజమాన్యంతో గన్నీల సరఫరా కు పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకున్నారు. ఆన్లైన్ ప్రొక్యూర్ మెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ లో (ఓపీఎంఎస్) లో వెంటనే పెండింగ్ ఎంట్రీలునమోదు చేసి ధాన్యంచెల్లింపులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివ, వేముల మాజీ ఎంపీటీసీ యాటాసత్యనారాయణ, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా వీర సావర్కర్ జయంతి



వీరసావర్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**రేవల్లి, మే 28 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని తలుపునూరు గ్రామంలో చైతన్య యువజన సంఘం అధ్యక్షులు భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు హిందుత్వ భావజాల రూపకర్త వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి కార్యక్రమాన్ని సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ సావర్కర్ బ్రిటిష్ పాలనను ఎదిరించి రెండు యావజీవ కారకార శిక్షలు అనుభవించి దేశం కోసం పోరాడిన గొప్ప దేశభక్తుడని గొప్ప సంఘసంస్కర్త విప్లవకారుడని ప్రశంసించారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో గల భగూర్ గ్రామంలో జన్మించారు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి విప్లవ కార్యకలాపాలలో విద్యార్థి దేశ నుండే పాల్గొంటూ మిత్రమేళా పాల్గొంటూ మిత్రమేళా అనే రహస్య సంస్థను స్థాపించారు తర్వాత ఇది అభినవభారత్ గా మారింది ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లి అక్కడ ఇండియా హౌస్ ద్వారా విప్లవ భావాలను వ్యాప్తి చేశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినందుకు ఆయనకు 50 సంవత్సరాల ద్వీపాంతర శిక్ష విధించారు. అండమాన్ లోని సెల్యులార్ జైలులో 11 ఏళ్లపాటు అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడిపారని అన్నారు. రత్నగిరి జైలులో ఉన్న సమయంలో హిందుత్వ అనే రాజకీయ జాతీయ వాద భావజాలాన్ని అభివృద్ధి చేశారు. హిందూ మహాసభలో ప్రముఖ పాత్ర పోషించేవారు అంటరానితర నిర్మూలనకు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా రత్నగిరిలో ఎన్నో ఉద్యమాలు చేశారు. అందరికీ ఆలయ ప్రవేశాన్ని కల్పించాలని పోరాడారు జీవిత చరమాంకంలో తన లక్ష్యం నెరవేరిందని భావించి ఫిబ్రవరి 1, 1966 నుండి నిరాహారదీక్ష చేసి ఫిబ్రవరి 26, 1966న ముంబైలో ఆయన మరణించారు. ఇంతటి గొప్ప మహావీరుని జయంతి కార్యక్రమం మొట్టమొదటిసారిగా మన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అధ్యక్షులు భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు గ్రామ ఉపసర్పంచ్ మల్లేష్, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ తప్పుడు ప్రచారాలకు రైతులు మోసపోవద్దు

● పెద్దమందడి కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి

**పెద్దమందడి, మే 28 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలో ఐ.సత్యారెడ్డి నివాసంలో కాంగ్రెస్‌నాయకులు గురువారం మీడియా సమావేశం నిర్వహించి మాజీ మంత్రి సింగిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన నిరంజన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు పూర్తిగా విఫలమైందని ఆరోపించిన విషయం తెలిసిందే. ఆ విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ రైతులు టిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. మరో వారం రోజుల్లో మండలంలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని రైతులు ఎలాంటి ఆందోళనలకు గురికావలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. గత బిఆర్ఎస్ పాలనలోనే రైస్ మిల్లుల్లో భారీ అవకతవకలు జరిగాయని వాటిపై చర్యలు తీసుకుని అనేక మిల్లుల అనుమతులను రద్దు చేయడంతో ప్రస్తుతం కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడం పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి దృష్టి పెట్టిందని కేవలం రాజకీయ లబ్ధి కోసం టిఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్, సర్పంచులు సూర్య, గంగమ్మ, రవి, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, చిట్యాల వెంకటయ్య, మాజీ సర్పంచ్ సిద్దయ్య, రాఘవేంద్ర, ప్రవీణ్ రెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



**పెబ్బేరు, మే 28 ప్రభాతవార్త :** మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పెబ్బేరు మండలాధ్యక్షులు యాపర్ల రామ్ రెడ్డి గురువారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. గురువారం మండల పరిధిలోని గుమ్మడం గ్రామంలో పలు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వారికి వినతి పత్రం అందజేశారు. విగ్రహాల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు సురేందర్ గౌడ్ .వెంకటేష్. గంధం రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

## భూత్పూర్‌లో పర్యటించిన సివిల్ సప్లై అధికారులు

-హస్నాపూర్, శేర్పల్లిలో తడిసిన ధాన్యం మిల్లుకు తరలింపు

**భూత్పూర్, మే28, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దయిన వరి ధాన్యపు బస్తాలను గురువారం జిల్లా సివిల్ సప్లై అధికారులు సమీప మిల్లుకు తరలించి రైతులకు ఊరట కల్గించారు. భూత్పూర్ మండలం హస్నాపూర్, శేర్పల్లి(హెచ్)గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి రైతులు కల్లాల వద్ద ఉంచిన వరధాన్యం కుప్పలు వర్షంతో మునిగి ముద్దయ్యాయి. విషయం తెల్సుకున్న జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా సివిల్ సప్లై డీఎంరవినాయక్, డీసీఎస్ఓ శ్రీనివాసులు హుటాహుటిన శేర్పల్లి(హెచ్), హస్నాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతుల వద్ద నుంచి తడిసిన ధాన్యాన్ని సేకరించి లారీలలోకి ఎక్కించి సమీప బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించారు. ఈ సందర్భంగా శేర్పల్లి(హెచ్)కు చెందిన రైతు శ్రీనివాసులు మాట్లాడుతూ తాను మూడున్నరెకరాలు కౌలుకు తీసుకుని వరిపంటను వేశానని, చేతికొచ్చిన పంట బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగిందని జిల్లా అధికారులు స్పందించి తమ తడిసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించి తనకు మేలు చేశారని, బిల్లును త్వరలో ఇప్పిస్తారని తనకు హామీ ఇచ్చారని తెలిపారు.

## బాలానగర్ ఎస్సై బదిలీ

**బాలానగర్, మే 28 ప్రభాతవార్త :** బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై లెనిన్ బదిలీ అయ్యారు. ఈ మేరకు గద్వాల రేంజ్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లోవిధులు నిర్వహిస్తున్న ఎస్సైనరేందర్ రెడ్డిని బాలానగర్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం బాలానగర్ లో పనిచేస్తున్న ఎస్సై లెనిన్ ను వీఆర్ మహబూబ్‌నగర్ కు అటాచ్ చేశారు. ఎస్సై లెనిన్ 2025 ఫిబ్రవరి 2 నుంచి బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి



**ఆత్మకూర్ మే 28, ప్రభాత వార్త:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 16వ జయంతి వేడుకలను మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఘనంగా జరుపు కున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రామారావు విగ్రహా నికి తెలుగుదేశం పార్టీ నాయకులు దివాంజి అశోకరావు, ఎస్టిడి శ్రీనివాసులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజకీయ ఓనమాలు నేర్పిన మాజీ ముఖ్యమంత్రి దివంగత నాయకులు నందమూరి తారక రామారావు ఆశయ సాధన కోసం తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపే తానికి నాయకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి చర్యలు చేపడతామని తీర్మానం చేయడం పట్ల తెలంగాణ రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ సైనికులు పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి తారక రామారావు అభిమానులు గాలి పంపు శ్రీనివాసులు, తిరుపతయ్య గౌడ్, కట్టెల మండి రాములు, వెంకటేష్ తదితరతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



**దామరగిద్ద, మే28 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలో స్వర్గీయ ఎన్.టి. రామ రావు జయంతి సందర్భంగా టిడిపి నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పార్టీజెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ టిడిపి మాజీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు రాములు యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మ గౌరవ ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, లింగరెడ్డిపల్లి సర్పంచ్ మొగులప్ప, వీరన్న గౌడ్, నారాయణగౌడ్, నర్సప్ప, అనిమిరెడ్డి, హర్షవర్ధన్, కనకప్ప, పలువురుటిడిపి నాయకులు పాల్గొన్నారు. నాయకులు షాద నగర్‌లో జరుగుతున్న వర్చువల్ మహానాడుకు తరలివెళ్లారు.

**వడ్డేపల్లి, మే 28 ప్రభాతవార్త:** తెలుగు జాతి ముద్దుబిడ్డ, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను శాంతినగర్ మున్సిపాలిటీలో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పల పూర్ణ చంద్రరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పీఠం వరకు వినిపించిన మహనీయుడు ఎన్టీఆర్. పార్టీ స్థాపించి కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు"అని కొనియాడారు. ఎన్టీఆర్ సినీ రంగంలో రాముడుగా, కృష్ణుడుగా తెలుగు ప్రజలఇళ్లలో దేవుడిగా పూజలందుకున్నారని రాజకీయాల్లో సామాజిక న్యాయం పరిపాలన వికేంద్రీకరణ వంటి విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారని గుర్తు చేశారు. గ్రామీణ పేదల ఆత్మగౌరవానికి విలువ తెచ్చిన మహానేతగా ఎన్టీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని "జోహార్ ఎన్టీఆర్" అంటూ నినాదాలు చేశారు.

## గంజాయి, మత్తు పదార్థాలపై ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

**వీపనగండ్ల మే28, ప్రభాతవార్త;** వీపనగండ్ల మండల కేంద్రంలో, తూముకుంట గ్రామంలో ఈ డాగ్స్వాడు తనిఖీలు నిర్వహించడం గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఎస్సై జె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బస్టాండ్, ప్రజా రద్దీ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో మిర్చి అనే ఈ డాగ్ స్క్వాడ్ ఏదైతే ఉందో పసిగట్టి పోలీసులు క్షుణ్ణంగా సమాచారం ఇవ్వడంలో తోడ్పడుతుంది అని ఆయన తెలిపారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి నిషేధిత పదార్థాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో మండలాన్ని మత్తు పదార్థాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై వెంకట్ రెడ్డి, కానిస్టేబుల్ అశోక్, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు
- ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



ఈద్గా వద్దా ముస్లిం సోదరులు అల్లాను ప్రార్థిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, మే 28 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలంలో గురువారం ఈద్ ఉల్ అదహ బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్స వాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం జామియా మసీదు లో ప్రత్యేక నమాజులు నిర్వహించి, పెద్ద సంఖ్యలో ఈద్గాకు అల్లాహ్ అక్బర్, అల్లాహు అక్బర్, అంటూ నినాదాలతో వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కౌకుంట్ల మండలంలోని వివిధ గ్రామాలలో శాంతి, సామరస్యం, శోభ్రాతృత్వం, నెలకొనాలని అల్లాను ప్రార్థించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని, బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం సాంప్ర దాయ బద్ధంగా కుర్బానీ నిర్వహించి మాంశాన్ని పేదల కు, బంధుమిత్రులకు పంపిణీ చేశారు. ఇళ్లలో ప్రత్యేక వంటకాలు తయారుచేసి కుటుంబ సభ్యులతో కలిసి పండగ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. గ్రామంలోని సర్పంచ్ నరేష్ కుమార్, మరియు ప్రజా ప్రతినిధులు తుమ్మల కిరణ్ కుమార్‌రెడ్డి, బడుగుల చంద్రారెడ్డి, పి.ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, కేబీఆర్ గౌడ్, కురవ రవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈపండగ త్యాగానికి దానధర్మాలకు ప్రతీక అని పేర్కొ న్నారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొని ముస్లింసోదరులఆనందోత్స వాలతోసందడి కనిపించింది.

**ఉప్పునుంతల, మే 28 ప్రభాతవార్త:** ఈద్ అల్ అధా (బక్రీద్) పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోద రులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి మర్రి పల్లి మార్గంలో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు సోదర భావంతో ఒక్కరినీ ఒక్కరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. ముస్లిం సోదరులు గ్రామం నుంచి ర్యాలీగా ఈద్గ వరకు చప్పట్లతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా త్యాగం, ప్రేమ, దయ, సహనం అనేమహత్తర విలువలను గుర్తు చేసుకుం టూపవిత్ర పర్వదినం రోజున ముస్లిం సోదరులు శాంతి, ప్రతి ఒక్కరి జీవితంలో ఆరోగ్యం, సంతోషం, అభివృద్ధి కలగాలని మజీద్ కమిటీ పెద్దలు ఆశీర్వదిస్తారు. ఈ కార్యక్రమంలోముస్లింసోదరులు మన్సూర్‌ఖాన్, ఉస్మాన్, బషీర్, ఇబ్రహీం, మజీద్, రజాక్, సైదులు,, రఫీ, బాబా, జహీర్, సయ్యద్, పాషా, ఖాసీం, చాంద్ పాషాతోపాటు ముస్లింసోదరులుభారీ సంఖ్యలో పాల్గొన్నారు.







ఈద్గా వద్ద చిన్నారులు ఒకరినొకరు అలింగణం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం

**వెల్టూర్‌లో:** మండలంలోని వెల్టూర్ గ్రామంలో గురు వారం పవిత్రమైన బక్రీద్ పండుగ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ముస్లిం సోదరులు ర్యాలీగా వెళ్లి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం త్యాగానికి ప్రత్యేకంగా నిలిచే బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోద రులు సోదర భావంతో ఇతరులకు సేవా కార్యక్రమాలు అందించడం ఆనవాయితీగా వస్తుందని వారు గుర్తు చేసు కున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని అభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండి ఆజిమొద్దీన్, కరీం, గౌస్, నీరంజన్, నీలి పాషా, పాషా, జహంగీర్, సయ్యద్, సమ్మద్, ఇమ్రాన్, నజీర్, ఏజాస్, మొగలాల్, యూసఫ్, ఫిరోజ్, ఖాజా, ఖాదర్, జానీ పాషా తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పెనిమెళ్ళ, సదగోడు, లక్ష్మపూర్, తాదురు తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు.

**భూత్పూర్, మే28, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గురువారం ముస్లింలు త్యాగానికి ప్రతీక జరిపే ఈద్-ఉల్-జుహ(బక్రీద్) పండుగను ఎంతో ఘనంగా నిర్వహించారు. భూత్పూర్, అమిస్తాపూర్, తాటి వర్తి, అన్నాసాగర్, కొత్తమొల్గర, మద్దిగట్లలలో ముస్లింలు ఈద్గాల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరి కొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరులకు పలు పార్టీలకు చెందిన నాయకులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్), మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా ముస్లిం సోదరకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భూత్పూర్ ఈద్గా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళీధర్‌గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్‌లు ముస్లిం నాయకులకు శుభా కాంక్షలు తెలిపారు. అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీ మైనార్టీ నాయకుడు ఎండి షాకీర్‌పాషకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

**అచ్చంపేట, మే, 28 ప్రభాతవార్త:** త్యాగాలకు ప్రతీక ప్రకృతి వేడుకలని భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు ఘనం గా నిర్వహించారు. పట్టణంలో నాగర్ కర్నూల్ రోడ్డు లో ఉన్న ఈద్గా వద్దకు ఉదయం ముస్లిం సోదరులు చేరు కొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ వారిని మర్యాద పూర్వ కంగా కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, మానవత్వానికి ప్రతీక అని. ప్రేమ, దయ, త్యాగం మన జీవితంలో భాగంకావాలని అన్నారు. అల్లాహ్ దీవెనలతో అందరూ సుఖసంతోషాలతో వర్ధి ల్లాలి. దీనిని ఈద్ ఉల్‌అధా (త్యాగాల పండుగ) అని కూడా అంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, రామనాథం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖాదర్ పాషా, కటకం రఘురాం, బుచ్చి రాములు, తదితరులు పాల్గొన్నారు.

**చిన్నచింతకుంట, మే28 ప్రభాతవార్త:** త్యాగానికి, నమ్మకానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ పర్వదినాన్ని గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ముస్లిం సోదరులు తమ ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ పఠనం చేశారు. మండల కేంద్రంలో అహ్మదీయ, మహమ్మదీయ ముస్లిం సోదరులు తమ ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ పఠనం తో పాటు అల్లా బోధించిన ప్రవచనాలను వినిపించారు. తమ పూర్వికుల సమాధుల వద్ద వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. గ్రామాలలో మతాలకతీతంగా అందరిని కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**రేవల్లి, మే 28 ప్రభాతవార్త:** రేవల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని తలుపునూరు, నాగపూర్ గ్రామా లలో గురువారం బక్రీద్ పండుగ ఉత్స వాలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే ముస్లిమ్స్ అంతా కలిసి డప్పులతో, దరువుల తో గ్రామంలో గల ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తలుపునూరు గ్రామంలో నిర్వహించుకున్న ఈ కార్యక్రమాలలో రేవల్లి మండల ఎస్ఐ రజిత పాల్గొన్నారు. సంతోషంగా భక్తిశ్రద్ధలతో పండుగ నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో వీరితోపాటు మైనారిటీ కమిటీ అధ్యక్షులు జలీల్, ముస్లిం నాయకులు మైనుద్దీన్, కాజా ,మైబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పెద్దమందడి, మే28 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలోగురువారం బక్రీద్ పండుగసందర్భంగా ముస్లిం సోదరులకు పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ చాటాలనిఅన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

**గద్వాల మే28, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని బక్రీద్ పండుగ సందర్భంగా గోనుపాడు గ్రామంలో, గద్వాల పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఈ ప్రార్థనలో పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ…త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండగ బక్రీద్ అని తెలిపారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితం కోరి ప్రతీ మానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని అన్నారు. తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్నిబక్రీద్ పండుగద్వారా నేర్చుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

**ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన పాల్గొన్న సరిత తిరుపతయ్య :** తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహ కార సమాఖ్య చైర్ పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరితమ్మ ముస్లిము సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సంద ర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం లోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో సరిత తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని సరితమ్మ బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ,సుఖశాంతులు, సౌభాగ్యాలు కలగాలనిఆకాంక్షించారు. అతిధులను ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సరితమ్మ ఆత్మీయంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి, గోనుపాడ్ శ్రీనివాస్ గౌడ్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, పాతపాలెం ఆనంద్ గౌడ్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి, రాము యాదవ్, సతీష్ యాదవ్, జమిల్, సన, జహంగీర్, సద్దాతుల కాంగ్రెస్ పార్టీకుటుంబ సభ్యులు, మైనార్టీసోదరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 28 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్‌లో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధల మధ్య గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డున గల ఈద్గా వద్ద ముస్లింలు ఈదుల్ అజహ ప్రత్యేక నమాజును నిర్వహిం చుకున్నారు. బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను జామీయా నిజామీయాకు చెందిన అలీం, జామియా మస్జీద్ ఖాతీబ్ హఫీజ్ షాకీర్ సిద్దిక్, హఫీజ్ మహబూబ్‌అలీలు వివరించారు. బక్రీద్ ముఖ్యతను ప్రవక్త ఇబ్రహీం అలైహి సలాంత్యాగ నిరతికి ప్రతీకగానిలుస్తుందని వివరించారు. ఖుర్బానీ స్థోమత కలిగిన ప్రతి ఒక్కరిపై ఖచ్చితంగా ఇవ్వాలని ఖురాన్ చెబుతుందన్నారు. 7 తులాల బంగారం, 52 తులాల వెండి లేదా డబ్బు కలిగిన వారు ఖచ్చితంగా ఖుర్బానీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇస్లాం ధర్మాన్ని ఆచరిస్తున్న వారు మత పెద్దలను నేరుగా సంప్రదించాలని, సమస్యలకుపరిష్కార మార్గాలను కనుగొనాలని సూచించారు. మొబైల్ రంగం అందు బాటులోకి రావడంతో ప్రతి ఒక్కరు దీనిని అనుసరి ంచడం వల్ల తప్పులు చేస్తున్నారని, అలాంటి వారిని అలా ఎప్పుడు క్షమించదన్నారు. ఖురాన్ హదీస్‌లను ఏళ్ల తరబడి అధ్యయనం చేసిన అలీమ్‌లు, మౌల్విలను సంప్రదిస్తే వారు షరియత్‌కు అనుగుణంగా సమాధానం చెబుతారన్నారు. ఇస్లాం ధర్మంచూపిన మార్గాన్ని సన్మా ర్గంలో అనుసరించినప్పుడు అది దేవుడు చూపిన మార్గం అవుతుందన్నారు. త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే బక్రీద్‌పండుగను ప్రతి ఒక్కరు సూక్ష్మంగా తెలుసుకో వాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అనంతరం హఫీస్ మొహమ్మద్ అన్వర్‌ఉల్ హక్ నక్ష్ బంది నిజామి ఈదుల్ అజహ నమాజ్ చదివించి ఖుద్బాను బోధిం చారు. అనంతరం వక్ఫ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ కమిటీ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపడానికి వచ్చిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులకు శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మైనార్టీ సోదరులు తదితరులు ఉన్నారు.



ఉప్పునుంతలలో మర్రి పల్లి మార్గంలో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**వెల్దండ, మే 28 ప్రభాతవార్త:** మత సామరస్యానికి ప్రతీకగా పండుగలు నిర్వహించుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదిన వేడుకులను నిర్వహించుకున్నారు. ఈద్గాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినం యొక్క ప్రత్యేక నమాజ్‌ను గావిం చారు. మండల కేంద్రంలో ఈద్గా వద్ద పలువురు రాజకీ య పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కుల, మత బేదాలు లేకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకొని శాంతిని నెలకొల్పలాన్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని, ముస్లిం సోదరులకు పండగకు ఎవ్వరు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. ఈద్గాలు, మసీద్‌ల వద్ద పోలీసు బందోబస్తులు నిర్వహించి పండుగ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మైనార్టీ సోదరులు ఉన్నారు.

**మక్తల్ టౌన్, మే 28 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకు న్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణ కేంద్రం లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించి ఈద్గా వద్ద స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ త్యాగం, సేవా భావం, మానవత్వానికిప్రతీకగా నిలిచే బక్రీద్‌పండుగ సమాజంలో సౌభ్రాతృత్వాన్ని, పరస్పర ప్రేమాభిమా నాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యవాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిమతాలను సమానంగాగౌరవిస్తూ ప్రజల సంక్షే మానికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

**వీపనగండ్ల మే 28, ప్రభాతవార్త ;** వీపనగండ్ల మండల కల్వరాల గ్రామంలో ఈద్గా వద్ద బక్రీద్ (ఈద్. ఉల్. ఆధా) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. గురువారం నాడు కలవరల్ల గ్రామంలోని ముస్లిం సోదరు లను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కలుసుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణు లందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు. ఈద్‌ఉల్‌ఆధా పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని కోరుకుంటు, ఈ పవిత్ర పండుగ మానవత్వాన్ని, సోదరభావాన్నిమరింత పెంపొందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము అని ఆయన అన్నారు. అందరికీ ఈద్ ముబారక్ అని శుభాకాంక్షలు తెలియజేశారు .ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సహోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామంలోసోదరభావం, ఐకమత్యం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో జామా మసీదు ప్రెసిడెంట్ ఎం.డి. సర్దార్ మియా, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ జవీద్ అలీ, కార్యవర్గ సభ్యులు నయ్యుం, రషీద్, గాఫర్, అఖిల్, ఖాదర్ పాషా, సయ్యద్ ఆమేర్, ముజీబ్, సల్మాన్, ఇమ్రాన్, ఇర్ఫాన్, రేహన్ తదితరులు పాల్గొన్నారు.





















## ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు

- ప్రశాంత వాతావరణంలో బక్రీద్ వేడుకలు
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి



ఈద్గా వద్ద బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ డి. జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, మే 28, ప్రభాతవార్త :** బక్రీద్ పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి. జానకి పరిశీ లించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే జిల్లాలోని అన్ని ఈద్గా ప్రాంగణాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది అప్ర మత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదరు లు, సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు. బక్రీద్ పండుగను సోదరభావంతో, ఆనందోత్సా హాలతో జరుపుకోవాలనిఆకాంక్షించారు. బందోబస్త్‌లో అదనపు ఎస్పి ఎన్.బి రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డిఎస్పి వెంకటే శ్వర్లు, డిసిఆర్ బిడిఎస్‌పిరమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ఎస్బి ఇన్స్పెక్టర్ మోతిరాం, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణా, ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాజేందర్‌రెడ్డి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాభావానికి ప్రతీక బక్రీద్ పండుగ : ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సమా జంలో సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం, మత సామరస్యం, పరస్పర గౌరవమన సమాజానికి బలమైన పునాది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలందరూ కలిసికట్టుగా శాంతి, అభివృద్ధి మార్గం లో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మాజీకౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డులో 107 మక్కల బస్తాలు మాయం!

(మొదటి పేజీ తరువాయి)

కనిపించకుండా పోవడంతో రైతు జితేందర్ ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడే కుప్పకూలిపోయారు. “నాలుగు నెలల పాటు రాత్రింబ వళ్లు కష్టపడి, చెమటోడ్చి పండించిన పంటను అదును చూసి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కళ్లముందే నా కష్టం కొల్లబోయింది” అంటూ ఆ రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ భారీ చోరీ ఘటనపై బాధిత రైతు అచ్చంపేట స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మార్కెట్ యార్డులోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, దోషులను త్వరితగతిన పట్టుకుని కఠినంగా శిక్షించాలని, అలాగే తన పంటను తనకు దక్కేలా న్యాయంచేయాలని పోలీసులను వేడుకున్నారు. ప్రభుత్వ మార్కెట్ యార్డులోనే రైతులకు రక్షణ లేకపోతే ఎలా అని స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం తగ్గదు



రైతులతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తరబడి కొనుగోలు కేంద్రంలో ఉండడంతో ఇటీవల కురిసిన అకాల వర్షం ధాన్యం తడిసి రైతులు ఇబ్బంది పడుతున్నారు. తూకమైన 80 వేల బస్తాలు పేరుకుపోయాయని తెలిపారు. ప్రభుత్వ ధాన్యాన్ని వెంటనే తరలించకపోతే బిజెపి పార్టీ నుండి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర బిజెపి కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాబా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, బాబు గౌడ్, వడ్డే రాజు, నితిన్ యాదవ్, చంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల్లో ఆందోళన అవసరం లేదు



ధాన్యం నిల్వలపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందని తెలిపారు. ఇంకా అదనంగా స్థలాలను ఏర్పాటు చేయడం కోసంచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హమాలీలను సైతం వీలైనంత ఎక్కువ మందిని రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ చిమనగుంటపల్లి శివారులో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర గోదామును సందర్శించి అక్కడ కూడా అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. హమాలీలను ఎక్కువ మందిని రప్పించి అన్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఆర్‌డిఓ ఉమాదేవి, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్ సింగ్, డిసిఓ రాణి, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లై ఆంజనేయులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రైతుల సంక్షేమాన్ని విస్మరించి గాలికి వదిలేశారు

- రైతుల కన్నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టదా..
- దిన దిన గండంగా మారుతున్న రైతుల బతుకులు
- కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**కొల్లాపూర్, మే 28, ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజక వర్గం పాన్ గల్ మండలంలోని చింతకుంట గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్రం స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి తో కలిసి వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా, రైతులు కష్టపడి ఆరు కాలం పండించిన పంటను కొనుగోలు చేయలేని ప్రభుత్వం నెల రోజులుగా కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన పంటను వర్షానికి తడిసి ముద్ద అవుతున్న ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ ఉంటే



వరి కొనుగోలు కేంద్రాని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

కనీసం స్పందన లేని కర్కశ ప్రభుత్వం అని అన్నారు. అకాల వర్షాలకు, తడిసి ముద్దయిన ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయట్లేదో అర్థం కావడం లేదని, ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెబుతూ, కేవలం ప్రకటనలకు పరిమితం అవుతూ!వరి ధాన్యాన్ని, మక్కలను కొనుగోలు చేయకుండా రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న నీతిమాలిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లు మోసపోతే గోస పడతాం అని చెప్పిన మాట 100 శాతం నిజం అయిందన్నారు. గత 45 రోజులుగా కొనుగోలు కేంద్రంలో రైతుల పడికాపులు కాస్తున్న అధికారులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. ఈ ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే కానీ పని చేయడం లేదని రైతులు కంటతడి పెడుతున్న జిల్లా మంత్రి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

## సురవరం కృషి ఎనలేనిది

**ఆయన చరిత్రను నేటి తరానికి తెలియజేప్పాలి : మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్**

**మహబూబ్‌నగర్, మే 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలను చైతన్య వంతులను చేయడంలో సురవరం ప్రతాపరెడ్డి చేసిన కృషి గొప్పదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సురవరం ఒక వర్గానికి, ప్రాంతానికి పరిమితమైన వారు కాదని అన్నారు. ఆయన జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కవులలే లేరని చెప్పిన రోజున 350 మందికి పైగా కవులతో గోల్కొండ కవుల సంచికను ప్రచురించి విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు.తెలంగాణ సాహిత్యానికి జాతీయ స్థాయిలో సురవరం గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

## ఘనంగా వినాయక దామోదర్ సావర్కర్ జయంతి



**నారాయణపేట, మే 28 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా పులిమామిడి గ్రామంలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో వినాయక దామోదర్ సావర్కర్ జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మొక్క నాటడం ద్వారా ప్రారంభించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ యువజన సంఘం సభ్యులకు మేరా యువ భారత్ జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ గౌడ్ క్రీడా సామగ్రి అయిన వాలీబాల్, ఫుట్‌బాల్, ఫ్రిస్బీ, స్కిప్పింగ్,హ్యాండ్‌బాల్‌లను అందజేశారు. యువత క్రీడలవైపు ఆసక్తి పెంచుకని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అనిల్ కుమార్ గౌడ్‌మాట్లాడుతూ వినాయక దామోదర్ సావర్కర్ జీవితం యువత కు ఆదర్శమని అన్నారు.భయపడకుండా నిజం కోసం నిలబడటం, దేశం కోసం ఆలోచించడం, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడం సావర్కర్ జీవితంలో నుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ కే.త్రివేణి మాజీ సర్పంచ్ పెద్దనాగన్న గౌడ్ మాట్లాడుతూ యువతలో దేశభక్తి, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు మేరా యువ భారత్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శ్రీరామ యువజన సంఘం అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తి, సేవాభావం, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాబాలికల ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు జగదీష్ గౌడ్, శ్రీరామ యువజన సంఘం సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో 30 మంది బిఆర్ఎస్ నాయకుల చేరిక



కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

**పెబ్బేరు,మే28 ప్రభాతవార్త:** టిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించిన యాపర్ల గ్రామానికి చెందిన మద్దిలేటి, మొగులాల్లినాయకుల కుటుంబ సభ్యులు దాదాపుగా 30 మంది స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శివసేన రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు నాయకులు తెలపడంతో పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందని, అందుకు పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకోవడం జరిగిందని తెలిపారు. పార్టీ కండువా కప్పుకోవడమే కాకుండా క్షేత్రస్థాయిలో పేద ప్రజల కోసం, పార్టీ కార్యకర్తల కోసం, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట పెబ్బేరు మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ వర్ధన్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ రాజకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## పారా అథ్లెటిక్స్‌లో దామరగిద్ద యువకుడి ప్రతిభ

**దామరగిద్ద, మే 28 ప్రభాతవార్త:** బెంగళూరులో నిర్వహిస్తున్న ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన కనకప్ప ప్రతిభ కనబరిచాడు.టీ44 విభాగంలో జరిగిన 100 మీటర్ల పరుగు పందెంలో 12.99 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు.ఈ సందర్భంగా దామరగిద్ద గ్రామ సర్పంచ్ అద్దన్‌కనికిరెడ్డి, గ్రామ నాయకులు,గ్రామ ప్రజలుకనకప్పను అభినందించారు. క్రీడల్లో మరింత రాణిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షి ంచారు.

## ఈవీ బైక్ షో రూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జియంఆర్

**మదనాపురం, మే28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ షో రూమ్ ప్రారంభోత్సవానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈవీ షో రూమ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. ఈవీ వాహనాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసున్న ఎమ్మెల్యే షో రూమ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన వాహనాలనుఅందించడంతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్ శారద రామకృష్ణ, మండల నాయకులు మహేష్,మహదేవ్ గౌడ్, గోపిస్వామి, విజయ్, శ్రీధర్ రెడ్డి, వేమన్న,శ్రీనివాస్ యాదవ్,వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో పంచాయతీలకు పండుగ

**ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్,మే 28, ప్రభాతవార్త:** ప్రజా పాలనలో గ్రామపంచాయతీలో పండగ వాతా వరణం నెలకొందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పంచాయతీ సిబ్బందికి ఒకటో తేదీన జీతాలు పడుతున్నా యని, సిబ్బంది జీతాల కొరకు ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి వేస్తుందన్నారు. కొత్త పింఛన్లలో ఒంటరి మహిళకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం లోపంచాయితీల్లో నిధులు లేక సర్పంచులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు దాపురించాయని ఆరోపించారు. ప్రజా పాలనలో ఆ దుస్థితి నుంచి క్రమంగా సర్పంచులకు స్వేచ్ఛను కల్పిస్తూ పాలన కొనసాగిస్తున్నామన్నారు.



# బక్రీద్ పండుగ ఐక్యతకు చిహ్నాం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**
**భక్తిశ్రద్ధలతో బక్రీద్ .. న్యూ గంజ్, రహమానియా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు**
**పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్**



ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే, మేయర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే28, ప్రభాతవార్త:** బక్రీద్ పండుగ ఐక్యతకు చిహ్నాం అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బక్రీద్ పండుగ సందర్భంగా న్యూ గంజ్, రహమానియా ఈద్గా దగ్గర జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని, ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, నిస్వార్థ సేవకు ప్రతీక అని ఆయన చెప్పారు.ఈ



ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

పర్వదినం మనలో సేవాభావం పరస్పర సహ కారం వంటి విలువలతో కులమతాలకు అతీతంగా స్నేహపూర్వకంగా సహనంతో జీవిద్దామని ఆయన పిలుపునిచ్చారు. మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లునర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్,టిపిసిసి ప్రధాన కార్య దర్శి మిథున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా పండుగలు నిర్వహించుకోవాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి, మే28 ప్రభాతవార్త:** మత సామంస్యానికి ప్రతీకగా పండుగలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గంలోని మండలాల్లో, గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదిన వేడుకులను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక నమాజ్ ఉద్-ఉల్-అజహా నమాజ్‌ను ఈద్గాలో చదివారు. కల్వకుర్తి పట్టణంలోని ముస్లిం సోదరులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డిలు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కుల, మత బేదాలు లేకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకొని శాంతిని నెలకొల్పలాన్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని, ముస్లిం సోదరులకు పండగకు ఎవ్వరు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని



సూచించారు. ఈద్గాలు, మసీద్‌ల వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తులు నిర్వహించి పండుగ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు ఉన్నారు.

# ఓట్లను పూర్తిగా ప్రక్షాళన చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యం

**మాజీ ఎంపి పోతుగంటి రాములు**

**వనపర్తి రూరల్, మే28, ప్రభాతవార్త:** నకిలీ తప్పుడు ఓట్లను పూర్తిగా ప్రక్షాళన చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని మాజీ పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు అన్నారు. గురువారం బిజెపి జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ అధ్యక్షతన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పై కార్యాశాల నిర్వహించడం జరిగింది.ఈ కార్యశాలకు ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఉన్న నకిలీ ఓట్లు, తప్పుడు ఓట్లను పూర్తిగా ప్రక్షాళన చేయడమే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమని చనిపోయిన వారిపేర్లు, వేరే ప్రాంతాలకు మారిన వారి ఓట్లను జాబితా నుండి తొలగిస్తారని తెలియజేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, అక్రమ ఓట్లను తీసివేయడం ద్వారానే స్వచ్ఛమైన ఎన్నికలు సాధ్యమవుతాయని,తాజాగా శాసనసభ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పద్ధతి ద్వారా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం వల్లే అక్కడ పోలింగ్ శాతం పెరిగిందని ఉదా హరణగా చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా జూన్,జూలై నెలల్లో ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జరగనుందని ఓటరు జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి పోతుగంటి రాములు

సవరణలో ఎక్కడ రాజకీయ పార్టీల ప్రమేయం ఉండదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సవరణ నిర్వహిస్తారని కాంగ్రెస్,బిఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని అప్రతిష్ట పాలు చేయడానికి ఎస్ఐఆర్ పై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్ళు బాగుంటేనే జీవిత లక్ష్యాలను సాధించగలం

**ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో క్రీడల శాఖ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**పెబ్బేరు,మే 28 ప్రభాతవార్త:** మానవుని అన్ని ఇంద్రియాలలో కెల్లా కళ్ళు చాలా ప్రధానమైనవి అని, అందుకే "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" కళ్ళు బాగుంటేనే జీవిత లక్ష్యాలను సాధించగలమని డిసిసి చీఫ్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు మండలంలోని గుమ్మడ గ్రామంలో భుజాల సోమమ్మ రంగా రెడ్డి మెమోరియల్ సొసైటీ, శంకర్ నేత్రాలయం చెన్నై వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మేఘ రెడ్డి, డిసిసి చీఫ్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డిల చేతుల



మీదగా ఉచిత కంటి శిబిరాన్ని రిబ్బన్ కత్తిరించి గురువారం ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరం లాంటిదని, కంటి చూపు బాగుంటేనే కలలు గన్న జీవితం సహకారం అవుతుందని, కంటి పరీక్షలను ఎవరు నిర్లక్ష్యం చేయొద్దని, కంటి సమస్యలు ఏవైనా ఉంటే సమయానికి చేయించుకోవాలని డిసిసి చీఫ్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలంటే కంటి వెలుగును ఖచ్చితంగా కాపాడాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించడం గొప్ప సామాజిక సేవ అన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, పెబ్బేరు మండల ప్రెసిడెంట్ రామ్‌రెడ్డి, నిర్వాహకులు ఖగేందర్ రెడ్డి. భువనేశ్వర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

## తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనకపోతే రైతులతో ఆందోళన చేస్తాం

**మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి**

**వీపనగండ్ల మే 28, ప్రభాతవార్త;** అకాల వర్షాలకు మార్కెట్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు ప్రభుత్వం చేయకపోతే రైతులతో ఆందోళన చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి హెచ్చరించారు మండలంలోని కల్వరాల గ్రామంలో అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి పంట తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. గురువారం నాడు ఆయన కరిచిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వడ్లు తడిసి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు నేడు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం కారణంగా రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యాన్ని తేమ శాతం, తరుగు వంటి నిబంధనలను సాకుగా చూపకుండా కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు బేషరతుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే కొనుగోలు



తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని వర్షాల నుంచి రక్షించేందుకు తక్షణమే సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని కోరారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, సత్యనారాయణ గౌడ్, కల్వరాల గ్రామ అధ్యక్షుడు ఎండి సర్దార్, మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, దయాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, బండారి బాబు, సంగినేనిపల్లి గ్రామఅధ్యక్షుడు వేణుమాధవ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మనపల్లిలో సోలార్ వెలుగులు

**రూ.6 లక్షలతో 30 సోలార్ వీధిలైట్లు వితరణ చేసిన నైస్ ఫౌండేషన్**

**లింగాల,మే 28 ప్రభాతవార్త:** మారుమూల గిరి గ్రామాలలో ప్రధాన వీధుల్లో రాత్రుల్లో చీకట్లను పారద్రోలి రహదారి మార్గం గుండా గ్రామంలో కాంతులు విరజిల్లాలని సంకల్పంతో నైస్ ఫౌండేషన్ సోలార్ వీధిలైట్లను వితరణ చేయడం ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ శంకర్ నాయక్ తెలిపారు. గురువారం లింగాల మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామంలో నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు లక్షల రూపాయల విలువైన 30 సోలార్ వీధి లైట్స్ ప్లేట్లు పరికరాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ గ్రామంలో రాత్రివేళలలో ప్రజలకు వెలుతురు సౌకర్యం కల్పించేందుకు ఈ సోలార్ లైట్స్‌ను అందించగా గ్రామస్థులు ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా గ్రామంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన సోలార్ లైట్స్‌వల్ల ప్రజలకు రాత్రిసమయంలో సురక్షితమైన వాతావరణం నెలకొందని అభిప్రాయపడ్డారు. విద్యుత్ అంతరాయం లేకుండా సోలార్ పలకతో వీధి దీపాల అమ్మచడంతో సోలార్ వెలుగులతో ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయన్నారు. గ్రామ అభివృద్ధికి ఎప్పటికప్పుడు సహకరిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న



సోలార్ వీధిలైట్లు వితరణ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నైస్ ఫౌండేషన్ పూర్ణచందర్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఆర్డిటి ఏటిఎల్ రాధాను కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామంలో సోలార్ లైట్స్ ఏర్పాటు చేయడంతో మహిళలు,యువకులు,వృద్ధులుహర్షం వ్యక్తంచేశారు.గ్రామంలో వెలుతురు సమస్య కొంతవరకు పరిష్కారమైందని ప్రజలు పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో పద్మనపల్లి సర్పంచ్ శంకర్, ఎర్రపెంట మాజీ సర్పంచ్ సన్నయ్య,గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పని వేళలు పొడిగింపు

**వనపర్తి, మే 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మార్కెట్ విలువల సవరణ నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ స్లాట్ల సంఖ్యను పెంచడంతో పాటు కార్యాలయ పనివేళలను ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 7.30 గంటల వరకు పొడిగించినట్లు వనపర్తి సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ రెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక ఏర్పాట్లు ఈ నెల 29వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి



**పెబ్బేరు,మే28 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 104వ జయంతి కార్యక్రమాన్ని గురువారం పెబ్బేరు మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు కె.రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామన్‌గౌడ్ మాట్లాడుతూ తెలుగు కళామతల్లి ముద్దు బిడ్డ వినీలాకాశంలోధృవతారాజకీయ క్షేత్రంలో సుపరిపాలనతో యావత్ తెలుగువారి హృదయం లో అన్న యన్‌టిఆర్ నిలిపోయాడని అన్నారు. ప్రపంచానికి తెలుగుజాతి ఖ్యాతిని చాటరాని అన్నారు అణగారిన వర్గాలకు అండగా పసుపు జెండాని నిలబెట్టారు. మహిళా సాధికారతకు బాటలు వేశారు. ప్రజల కోసం..ప్రగతి కోసం తెలుగుదేశం పార్టీని అంకితంచేశారు. సంక్షేమానికి చిరునామా అయ్యారు. అన్నా అంటే నేనున్నానంటూ ఆదుకున్నారు. కోట్లాది హృదయాల్లో కొలువైన మరణంలేని మహా మనిషి ఎన్టీఆర్ అని రామన్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు వాకిటి బాలరాజు, రవినాయుడు,తిరుమలేష్, పరమేష్,కుమారి శిరీషనాగరాజు, బాలరాజు, నాగేంద్రం యాదవ్, నేలికొండ రామచంద్రయ్య గౌడ్, వెంకటేష్, బలిజ మహేష్, మురళీగౌడ్, వెంకటేష్, రవి తదితరులు ఉన్నారు.





ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో నాయకులు

**నర్వ, మే 28 ప్రభాతవార్త:** దివంగత మాజీ సీఎం,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు,సినీ దిగ్గజం నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా నర్వ మండల కేంద్రంలోని బీసీ కమ్యూనిటీ హాలు వద్ద గురువారం ఆయనకు అభిమానులు,పార్టీ కార్యకర్తలు,రాజకీయ ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన నాయకుడిగా ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని వ్యాఖ్యానించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యమంలో వివిధ పార్టీల నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## పలు శుభ కార్యాలకు హాజరైన ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, మే 28 ప్రభాతవార్త:** మండలంలో పలు గ్రామాల్లో జరిగిన శుభ కార్యాలకు టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల యశోద ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికిహాజరయ్యారు.అదే విధంగా మండలంలోని కంసానిపల్లి గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరైయ్యారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, అచ్చంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ గార్ల పాటి శ్రీనివాసులు, కంసానిపల్లి సర్పంచు చీమర్ల లలిత వెంకటేశ్వర్లు, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్ట శేఖర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి అంతటి శేఖర్ గౌడ్, కంసానిపల్లి మాజీ సర్పంచ్ కొట్టే తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భట్టుపల్లి ఆలయానికి విరాళం



**భూత్పూర్, మే28, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం భట్టుపల్లిలో నూత నంగా నిర్మిస్తున్న శ్రీఅంజనేయ,శివాలయానికి చేగుంట సర్పంచి మల్లయ్య గురువారం రు.లక్ష చెక్కును విరాళంగా అందించారు.ఆలయ నిర్వహకులైన భట్టుపల్లి సర్పంచి లక్ష్మమ్మరఘుపతిరెడ్డి,రేకులపాటి భూపతిరెడ్డి, రంగారెడ్డి, మన్యపురెడ్డి,సుదర్శన్‌రెడ్డిలకు చేగుంట సర్పంచి మల్లయ్య చెక్కును అందజేశారు.తమ గ్రామ శివాలయ నూతన ఆలయానికి తనవంతుఆర్థిక సహాయం అందించిన చేగుంట సర్పంచి మల్లయ్యకు నిర్వహకులు లక్ష్మమ్మ రఘుపతిరెడ్డి, భూపతిరెడ్డి, రంగారెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

**విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ డిమాండ్**

**నారాయణపేట, మే 28 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నాయకులునల్ల బ్యాడ్జీలు ధరించి వీరసావర్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పవిత్ర గోమాత వధను ప్రోత్స హించేలా కొందరు చేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండించారు. గోరక్షణ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని, గో సంరక్షణ కోసం ప్రాణత్యాగానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. హిందూ సమాజ భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు. దేశంలోని 50 శాతానికి పైగా రాష్ట్రాల్లో గోవధ నిషేధ చట్టా లు అమలులో ఉన్నాయని తెలిపారు. గోవధకు పాల్పడే వారిపై, గోవధను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వీరసావర్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

